
# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 40 -

### - *ఉగాది పచ్చడి* -

### (UGADI PACHCHADI)

**పట్టువదలని** విక్రమార్కుడు మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద మోస్తూ నడకసాగించాడు. ‘విక్రా! మార్గమధ్యంలో నీకు శ్రమ అనిపించకుండా అనిపించేలా మరో కథ వినిపిస్తాను - విను -‘ అని బేతాళుడు ప్రారంభించాడు.

"ఎప్పటిలాగే ఏ తెలుగు చిత్రానికైనా తెలుగమ్మాయిల్నికాదని ఉత్తర భామల్నే హీరోయిన్స్‌గా తెచ్చుకుంటున్నారు. తమకు అవకాశాలిమ్మని దక్షిణ తెలుగు పిల్లలు యెన్ని నిర్మాత దర్శకుల చుట్టూ యెన్ని ప్రదిక్షిణాలు చేసినా ప్రయోజనం యోజనదూరంలో వుందో లేదో కూడా తెలియడంలేదు. ఎవరికైనా డబ్బింగే కదా, ఏ సినిమాకథ కూడా హీరోయిన్ చుట్టూ తిరగడంలేదుకదా అని దర్శక నిర్మాతలు యిహపరాల్లో యిహాన్ని హీరోకిచ్చి, పరవ్యామోహంతో పరాయి కన్యల్నే హీరోయిన్స్‌గా ఎన్నుకుంటున్నారు. సినిమా తీసేవారు, చూసేవారు అంతా అంగ భోగానికి బలి అవుతూ ప్రాంతీయతకు, పరాయి తీపికీ తేడా మరిచిపోయారు.

ఈ మధ్యనే ముంబయి నుంచి ‘పలుక్ తీపి సింగ్‘ అనే యంగ్ హీరోయిన్ హైదరాబాద్ తెలుగు చిత్రసీమలో హీరోయిన్‌గా ప్రవేశించింది. హాట్‌గా స్వీట్‌గా అనేక చిత్రాల్లో కనిపిస్తూ అనతికాలంలోనే టాప్ హీరోయిన్‌గా, టాప్‌లెస్ హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో మన్మధ గునపాలు పాతేసింది.

ఇలా మన తెలుగు సినిమాలు మూడు హీరోలు, ఆరు హీరోయిన్లతో ఆడుతూ పాడవుతూ వుండగా, యిండస్ట్రీలో ఓ కలకలం మొదలైంది. తెలుగు అమ్మాయిలకు హీరోయిన్ అవకాశాలు యివ్వడంలేదనీ, ఉత్తరాది పిల్లలకే యిస్తున్నారని, తెలుగునీ, తెలుగుదనాన్నీ తెలుగుస్త్రీ కళాకారుల్నీ ప్రోత్సహించడంలేదని తెలుగు మహిళాలోకం అంతా, టివీ ఛానల్స్ సాయంతో అందరికీ చాటిచెప్పి, యీ అన్యాయాన్ని అరికట్టి మన తెలుగు హీరోయిన్స్‌కి ప్రోత్సాహ న్యాయం జరిగి తీరాలని వుద్యమం చేపట్టారు. రాజకీయ నాయకుల్ని, నిర్మాత దర్శకుల్ని అర్ధించారు. ఏవీ పని జరగలేదు సరికదా, దేనికైనా ముందు కమిట్‌మెంట్ అవసరం అంటూ కబుర్లు చెప్పి, కాకరకాయలు తినిపించారు.

చివరకు విసిగివేసారిన వేషాలు దక్కని తెలుగు హీరోయిన్లంతా వొక మీటింగు పెట్టుకుని ఆ మీటింగులో మహాఘాటైన ఫలితం సాధించే ఆలోచన చేసారు. అంతా కలిసి లేడీ ఆర్టిస్టులకు డబ్బింగ్ చెప్పే డబ్బింగ్ కళాకారిణులను కొన్నాళ్లపాటు డబ్బింగ్ చెప్పకుండా సెలవు తీసుకోమని అర్థించి సాయం కోరారు. సాటి స్త్రీ కళాకారిణుల కోసం తప్పకుండా యీపాటి త్యాగం చేస్తాం అని లేడీ డబ్బింగ్ ఆర్టిస్టులంతా ఆ రోజు నుంచీ డబ్బింగ్ మానేశారు. తెలుగు కన్యల హీరోయిన్ అవకాశాల సమస్యకు యిది తప్ప వేరే మార్గం లేదని టీవీ ఛానల్స్ కూడా తమ ఏంఖరూతనిచ్చాయి. అంతే. ఆ మర్నాటినుంచీ తెలుగురాని వుత్తరాది హీరోయిన్లకు - అగ్రతార పలుక్ తీపిసింగ్‌తో సహా తెలుగు డబ్బింగ్ సమస్యగా మారి, తెలుగు చిత్రనిర్మాత దర్శకుల గొంతులో పచ్చివెలక్కాయ పడి ఎవర్నీ వొకర్ని ‘కమిట్‘ అవ్వమని అడగడానికి కూడా గొంతు పెగల్లేదు.

ఆల్‌రెడీ నిర్మాత జంపులబాబు, దర్శకుడు కామాతుర్రావు వుత్తర తార పలుక్ తీపి సింగ్‌ని హీరోయిన్‌గా జంటగా కమిట్ చేసి బుక్ చేసి తమ కొత్త చిత్రం మొదలెట్టేశారు. తెలుగు డబ్బింగ్ కొదవ కారణం వల్ల పలుక్ తీపిసింగ్, స్క్రిప్టు యింగ్లీషు అక్షరాల్లో రాసిస్తే తన తెలుగు డైలాగులు తనే జాలీగా చెప్పేస్తానంది. యూనిట్ అంతా హమ్మయ్య అనుకున్నారు. కవిగారి స్క్రిప్టు తీసుకుని అసిస్టెంట్ డైరెక్టర్ కంగారు శర్మ, హీరోయిన్ డైలాగ్స్ యింగ్లీషు అక్షరాల్లో టైప్ చేసేసాడు. కొన్ని తెలుగు అక్షరాలకు పలుకు సౌమ్యం కుదిరే యింగ్లీషు అక్షరాలు కుదరకపోయినా వేరే అక్షర్యంతరం లేక ఎడ్జస్టయిపోయి టైప్ చేసేడు. ఇదేవిటయ్యా? అని కామాతుర్రావు అడిగితే కంగారుశర్మ, ‘అయ్యా! పాశ్చాత్య భాషల్ని రాసింది పలకవచ్చు, పలికేదేమైనా రాయొచ్చు. కానీ మన సంస్కృతిలో మన భారతీయ భాషల్ని రాసే మాటలు పలికినా, పలికేవన్నీ రాస్తే రాయుచ్చుక్కొడతారు. కానీ మెల్లగా మార్పు వస్తోంది. తెలుగు గ్రాంథికం నుంచి శిష్టవావహారికంలోకి మారిస్తే గురజాడ వార్ని తదితర ప్రముఖుల్నీ తలలు వాచేలా తిట్టిపోసారు. మరిప్పుడంతా అందరికీ తెల్ల వ్యామోహం పెల్లుబుకిపోతోంది. ఇడ్లీ, దోసెల్లొంచి బర్గర్ల మీద పడ్డారు. నమస్కారం మానేసి హాయ్ అంటున్నారు. ఇంగ్లీషు నాలుగక్షరాల అశ్లీలాలు అర్థం పట్టించుకోనంత అలవాటయిపోయాయి. క్రమంగా మనకీ మార్పు తప్పదు. మన విద్యావిధానాల స్థాయి పుణ్యమా అని మన యువతకి యీ కొత్త తెలుగు అన్ని పుంతలూ తొక్కుతుంది. అయినా కథలో ఎమోషన్స్ అన్నీ కంచికెళ్లి పోయి, ప్రేక్షకుల కళ్లన్నింటినీ కథానాయిక వొళ్లు కబ్జా చేస్తుంటే డైలాగులు యెవడు వింటాడు డైరెక్టరుగారూ - మీరేం వర్రీ అవకండి. మన హీరోయిన్ పలుక్ తీపిసింగ్ తెలుగు డైలాగ్ డెలివరీ కుమ్మేస్తుంది. మీకా డౌటక్కర్లేదు. రండి. షాట్ మొదలెడదాం -‘ అని అసిస్టెంట్ డైరెక్టర్, డైరెక్టర్‌కి హామీ, హీరోయిన్‌కి షాట్స్‌కి కావలిసిన డైలాగ్స్ యింగ్లీషు టైపులో యిచ్చాడు.

షూటింగ్ మొదలైంది. ఫస్ట్ షాట్ హీరో, హీరోయిన్ల మీద. పలుక్ తీపి సింగ్ యింగ్లీషు అక్షరాల్లో టైప్ చేసిన తెలుగు డైలాగ్స్‌ను బాగా చదువుకుని నాలికమీద పట్టించుకుంది. స్టార్ట్ కెమెరా అన్నాడు దర్శకుడు కామాతుర్రావు.

హీరోయిన్ పలుక్ తీపిసింగ్ పలికింది హీరోతో -

‘MOHAN! IPPUDU NEEKU NAA THEEPI MUDDIVVANA?’

(మోహన్! ఇప్పుడు నీకు నా తీపి ముద్దివ్వనా?) - అని.

వెంటనే నిర్మాత జంపులబాబు, దర్శకుడు కామాతుర్రావు అర్జంటుగా పక్షవాతం వచ్చినట్టు కింద పడిపోయారు. అసిస్టెంట్ డైరెక్టర్ కంగారు శర్మ ‘షాట్ ఓకె‘ అన్నాడు. అని నెక్స్ట్ షాట్‌కి - ‘స్టార్ట్ కెమెరా!‘ అన్నాడు వెంటనే ప.తీ.సింగ్ హీరోతో ‘ANTA PEDDA MODDA?’(అంత పెద్ద మొద్దా?) అంది. వెంటనే ‘నీకెలా తెలుసు?‘ అని గొణుగుతూ హీరో కిందపడిపోయాడు. హీరోయిన్, ‘క్యాహువా?‘ అంటూంటే కంగారుశర్మ ‘ప్యాకప్‘ అన్నాడు. షూటింగ్ ఆగిపోయింది. తర్వాత ఆ చిత్రనిర్మాణం ఆగిపోయింది.

– అదీ విక్రమార్కా! జరిగిన విషయం. ఇప్పుడు చెప్పు ఆ తర్వాత జరిగిన పరిణామాలేవిటి? నా యీ ప్రశ్నకు నువ్వు తెలిసీ బదులు చెప్పకపోయావో నీ తల యింగ్లీషు హెడ్ అయి వెయ్యి తెలుగు అశ్లీలతునకలైపోతుంది.'' అని ముగించాడు బేతాళుడు.

అప్పుడు విక్రమార్కుడు, – 'ఓ! బేతాళా! ఆ తర్వాత హీరోయిన్ పలుక్ తీపి సింగ్ తాత్కాలికంగా తెలుగు సినిమాలు వదిలేసి తెలుగు భాష ప్రాక్టీసు చైడానికి పనికొచ్చే వేరే వుద్యోగాల కోసం వెదికింది. ఆమె వెతుకులాట ఫలితంగా ఆమెకు హైదరాబాదు రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్ట్‌లో ఎనౌన్సరుగా వుద్యోగం వచ్చింది. ఎనౌన్స్‌మెంట్స్ అన్నీ మైక్‌లో తెలుగు భాషలోనే చెయ్యాలని షరతుపెట్టారు. కొత్త జాబ్‌లో చేరిన పలుక్ తీపిసింగ్ తన మొట్టమొదటి తెలుగు ఎనౌన్సుమెంట్ యిలా చేసింది. ఢిల్లీకి పోయే ప్రయాణీకులు ముప్పై ఐదవ దవారము వద్దకు పొండు, భువనేశ్వర్‌కి పోయే ప్రయాణీకులు యిరవై నాలుగవ దవారము వద్దకు పొండు, విశాఖపట్నంకి పోయే ప్రయాణీకులు ముప్పయి వొకటవ దవారము వద్దకు పొండు – పూనాకి పోయే ప్రయాణీకులు ఇరవై రెండవ దవారము వద్దకు చనుడు అని.

ఆ మర్నాడే ఆ వుద్యోగం పోగొట్టుకుని తెలుగు నేర్చుకోడానికి శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి వెళ్లేందుకు ఆటో యెక్కింది..

తెలుగు సినీనిర్మాతలు క్రమంగా తెలుగు అమ్మాయిలకు హీరోయిన్ ఛాన్సులు యివ్వడం మొదలెట్టారు. తెలుగు సినీకళాకారిణుల సమస్య పరిష్కరించేందుకు సాయపడిన లేడీ డబ్బింగ్ ఆర్టిస్టులకు తెలుగు టివి ఛానల్స్ వారికీ, తెలుగు మహిళా సమాజాలు ఘనంగా సన్మానం చేశాయి.

యదృచ్ఛయాచోపపన్నం
స్వర్గద్వారమపావృతమ్ |
సుఖినఃక్షత్రియాః పార్ధ
లభంతే యుద్ధ మీ దృశమ్||

ఈ యుద్ధము కావాలనుకోలేదు. దానంతటదే వచ్చినది. స్వధర్మపాలన వలన మోక్షప్రాప్తి కలుగును. ఈ యుద్ధములో ప్రేయము, హితముకూడ చేరివున్నవి. ఇంత సదవకాశము ఎంత భాగ్యము చేసుకున్న వారికోగాని లభించదు. అలాంటి అదృష్టం తెలుగు హీరోయిన్‌లను వెతుక్కుంటూవచ్చినది. – అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు.–'' అని రిప్లీకరించగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి మళ్లీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments